www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 3 నవంబర్ 2023
5
వైఎస్ఆర్

ఉపాధి కోసం ఉద్యమిద్దాం : డివైఎఫ్ఐ

కడప అర్బన్ : యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఉద్యమించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు జి.జగదీష్ పిలుపునిచ్చారు. గురువారం డివైఎఫ్ఐ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలో ప్రభుత్వ ఐటిఐ వద్ద నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు షాకీర్, డి.ఎం ఓబులేసు ఆధ్వర్యంలో డివైఎఫ్ఐ జెండాను రాష్ట్ర కమిటీ నాయకులు జగదీష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట నాయకులు జి.జగదీష్ మాట్లాడుతూ 1980వ సంవత్సరం పంజాబ్ రాష్ట్రంలోని లుధియానా నగరంలో అందరికీ విద్యా ఉపాధి కావాలంటూ ఏర్పాటైన డివైఎఫ్ఐ నేడు దేశంలోనే అతిపెద్ద యువజన సంఘంగా ఎదిగిందని తెలిపారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా విధానాలకు వ్యతిరేకంగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల సాధనకై యువత ఉద్యమిం చాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కరువు మండలాలు ప్రకటించకపోతే

ఆందోళన తప్పదు

- 7న కలెక్టరేట్ ఎదుట ధర్నా
- రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష రాజకీయ, రైతు సంఘాల నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో కరువు మండలాలు ప్రకటించకపోతే ఆందోళన తప్పదని అఖిలపక్ష రాజకీయ పార్టీలు, రైతు, ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. ఎపి రైతు సంఘం కడప జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కడప జిల్లాలో కరువు మండలాలు ప్రకటించాలని గురువారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప జిల్లాలో కరువు మండలాల పట్ల ముఖ్య మంత్రికి ఏమాత్రం కనికరం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కరువు మండలాలు ప్రకటించాలని ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలం చెందారని విమర్శించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి ఉంటే ఈరోజు కొంతవరకైనా కరువును నివారించవచ్చని అభిప్రాయపడ్డారు. కానీ పాలకులు నిర్లక్ష్యం కారణంగానే ఇవాళ జిల్లాలో కరువు విలయతాండం చేస్తున్నదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ 103 కరువు మండలాలు ప్రకటిస్తే కడప జిల్లాలో ఒక్క కరువు మండలం కూడా లేకపోవడం దుర్మార్గమని తెలిపారు. జిల్లాలో 36 మండలాలలో ఖరీఫ్ సీజన్ ముగిసేనాటికి తీవ్ర వర్షా బావ పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. వేసిన పంటలు నిలువునా ఎండిపోతున్నాయని, జిల్లా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి కరువు మండలాలను ప్రకటించే విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రబీ సీజన్ ప్రారంభమైందని ఇప్పటి వరకు వర్షమే కురవలేదని తెలిపారు. పంట పొలాలన్నీ బీడు భూములుగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరువు కోరల్లో కడప జిల్లా చిక్కుకుందని, రైతులకు భరోసా ఇచ్చేలా జిల్లా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు గ్రామాలలో పర్యటించాలని కోరారు. ఎండిపోయిన పంటలకు తక్షణమే ఈ క్రాప్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతాంగానికి పూర్తి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కరువు సహాయక చర్యలు , కరువు మండలాలు ప్రకటించకపోతే రానున్న కాలంలో అఖిలపక్ష రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన, పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి జి చంద్ర, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామ్మోహన్, టిడిపి రాష్ట్ర నాయకులు లక్ష్మిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సత్తార్, బిఎస్పి రాష్ట్ర కార్యదర్శి ఎస్. గురప్ప, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ ఆర్. చంద్రశేఖర్ రెడ్డి, అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు దస్తగిరి రెడ్డి, సుబ్బారెడ్డి, రైతు సంఘం సీనియర్ నాయకులు బి.నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, రైతు స్వరాజ్య వేదిక జిల్లా కన్వీనర్ శివారెడ్డి, రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎ.వి.రమణ, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు రమణయ్య, సిఐటియు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మనోహర్, నాగసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

సిఎం జిల్లాలో కరువు కానరాలేదా?

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జిల్లా వాసి అయి ఉండి కూడా కడప జిల్లాలో కరువు కనిపించలేదా అని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి ప్రశ్నించారు. గురువారం చెమ్ము ముయాపేటలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 51 మండలాల్లో వర్షమే లేదన్నారు. రైతుల వద్దకు మంత్రులు, ఎమ్మెల్యేలు వెళ్లి భరోసా ఇచ్చిన దాఖలాలు లేవని విమర్శించారు. సిఎం సొంత జిల్లాకు మొదట ఏదైనా ప్రకటిస్తారని వైసిపి పాలనలో పరిస్థితులు రివర్స్ గేర్ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ ఉందో లేదో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. గ్రాఫ్ ఇన్సూరెన్స్ మే, జూన్ లో కాకుండా డిసెంబర్‌లోనే ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సంప్రదించాలని కోరారు. కరువు పై నివేదికలు కోరితే రైతులకు ఎక్కడ డబ్బు ఇవ్వాల్సి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. రైతులకు కూడా బటన్ నొక్కి ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘాల ఆందోళనలో భాగస్వాములవుతామని తెలిపారు. డిప్యూటీ సీఎం, కలెక్టర్ స్పందించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

'బుద్ధిగా ఉండండి..లేదంటే తాట తీస్తా' : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

'గతంలో ఏం జరిగిందో నాకు తెలియదు.. పద్ధతి మార్చుకోండి...ఇదే ఫైనల్ వార్నింగ్.. కాదని తప్పిదాలు చేస్తే తాట తీస్తా' అని ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ రౌడీ షీటర్లను హెచ్చరించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో గురువారం నగరంలోని డిటిసి లో కడప సబ్ డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఎస్‌పి కౌనెల్సింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ కదలికలపై పోలీసు నిఘా దగ్గరగా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని గమనించి ఒళ్లు దగ్గర పెట్టకుని ప్రవర్తనను మార్చుకోవాలని పేర్కొన్నారు. దందాలు, పంచాయితీలు మానుకోవాలన్నారు. ఇకపై ఏదైనా నేరం చేసినా, చేయించినా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రతి వారం విధిగా పోలీసుస్టేషన్‌లో హాజరువేయించుకోవడంతో పాటు అసాంఘిక శక్తులు, కార్యక్రమాలపై సమాచారం అందించాలన్నారు. భవిష్యత్తులో ఎటువంటి చెడు పనులకు పాల్పడకుండా మీ బంధువుల తరపున, పెద్దల నుంచి పూచీ ఇస్తూ పోలీస్ శాఖకు బాండ్లు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్ర మంలో కడప డిఎస్‌పి ఎం.డి షరీఫ్, ఫ్యాక్షన్ జోన్ డిఎస్‌పి .బాలస్వామిరెడ్డి, కడప సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాన జాడ కరువు



కేతవరం వద్ద దర్శనమిస్తున్న బీడు భూములు

- సాగునీటికి కటకట...రైతులు విలవిల
- ఖరీఫ్ ఖాళీ.. కన్నీరు మిగిల్చిన రబీ
- కరువును గుర్తించని ప్రభుత్వం

ప్రజాశక్తి - చాపాడు

కడప జిల్లాలో కరువు తాండవిస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు గణనీయంగా తగ్గింది. రబీ సీజన్‌ను నమ్ముకున్న రైతులకు కన్నీరే మిగులుతుంది. నవంబర్ ప్రారంభమైనప్పటికీ వాన జాడ కన్పించకపోవడంతో రైతుల్లో దిగులు ఏర్పడింది. దీంతో పంటలు సాగుచేయాలా? వద్దా? అన్న సందిగ్ధంలో అన్నదాతలు కొట్టుమిట్టాడుతున్నారు. వర్షాలు పడతాయన్న నమ్మకంతో పంటలు సాగు చేసిన పంట కళ్లేదుటే ఎండుతుంటే రైతులకు చివరకు కన్నీరే మిగులునుంది. కొందరు ఆశావాహులు రానున్న రోజుల్లో ప్రకృతి చల్లగా చూడకపోతుందా నాలుగు చినుకులు రాలక పోతాయా అన్న ఆశతో అవకాశం ఉన్న దారులను చూసుకొని పంటలను కాపాడుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నీటి సేకరణకు నానా తంటాలు పడుతున్నారు. గతంలో కెసి పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 90వేల ఎకరాలలో వరి పంటను రైతులు సాగు చేసేవారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా 10వేల లోపు మాత్రమే సాగైంది. రబీలో 50 వేల ఎకరాల మేర ఆరుతడి పంటలను రైతులు సాగు చేపట్టారు. ప్రస్తుతం వర్షాలు లేకపోవడం, కాలువకు నీరు విడుదల కాకపోవడంతో పంటలు ఎండుతున్నాయి. మినుము , పెసర, జొన్న పంటలను సాగుచేసి ఇబ్బందులు పడుతున్నారు. రాజుపాలెం, జమ్మలమడుగు, పెద్ద మోడియం, మైలవరం, ఎర్రగుంట్ల , కమలాపురం, పులివెందుల ప్రాంతాలలో బుడ్డ శనగ పూర్తిగా తగ్గింది. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో భూమి పదునుకాకపోవడంతో సాగుకు విరామం ప్రకటించారు. సాగుకు రైతులు ముందుకు రావడం లేదు. చాపాడు మండలంలో 16 వేల ఎకరాల్లో వరి పంట సాగు అయ్యేది. 5300 ఎకరాలలో మాత్రమే వరి పంట సాగు అయినది. మిగిలిన విస్తీర్ణంలో రబీలో ఆరుతడి పంటలు సాగు చేపట్టారు. ప్రస్తుతం ఈ పంటలు వర్షం రాక, కెసి నీరు విడుదల కాక పంటలు ఎండిపోతున్నాయి. ప్రభుత్వం మాత్రం జిల్లాలో కరువు మండలాలను ప్రకటించకపోవడం దారుణమని రైతులు పేర్కొంటున్నారు.

అడుగంటిన భూగర్భజలాలు..

వాతావరణం అనుకూలముగా ఉండి అన్ని పరిస్థితులు సానుకూలంగా ఉన్నప్పుడే రైతుకు గిట్టుబాటు ధర లభించడం కష్టం. ఈ ఏడాది రైతుల పట్ల వరుణుడు జాలి చూపడం లేదు. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. దీంతో భూగర్భజలాలు అడుగంటాయి. జిల్లాలో 14 చిన్న, మధ్య తరహా, పెద్ద జలాశయాలు ఉన్నాయి. జల వనరుల నిల్వ సామర్థ్యం 84.489 టిఎంసిలు కాగా 41 టిఎంసిల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. రబీలో 4.50 లక్షల ఎకరాలలో ఆరుతడి పంటలు సాగు కావాల్సి ఉంది. కానీ జిల్లాలో సాగు గణనీయంగా తగ్గే అవకాశం కనిపిస్తుంది. దీంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పంటపై పెట్టిన లక్షలాది రూపాయలను వదులుకోలేక పలువురు రైతులు కొత్తబోర్లు వేయించారు. 600 అడుగుల లోతులో కూడా చుక్కనీరు లభ్యంకాలేదు. ఒకరిద్దరు రైతులు ఆశకొద్ది రెండు, మూడు బోర్లు తవ్వించారు. కానీ వారి ప్రయత్నం నిరుపయోగమైంది. కెసి కాలువ పరిధిలో గుంతలలో ,వంకలలో మోటర్లు పెట్టి సాగునీటి కోసం రైతులు అవస్థలు పడుతున్నారు.

ఎండిన కుందూ నది

కుందు నదిలో ప్రతి సంవత్సరం నీరు సమృద్ధిగా ప్రవహించేది. సెప్టెంబర్ నుంచి జనవరి వరకు దిగువకు ప్రవహిస్తూ పరవల్లు తొక్కేది. ఈ ఏడాది పరిస్థితి అందుకు భిన్నంగా తయారైంది. సెప్టెంబర్‌లో వినాయక చవితి సందర్భంగా నిమజ్జనం సందర్భంలో విగ్రహాలు మునిగే పరిస్థితి కూడా లేకుండా పోయింది. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాల వల్ల ఈ ఏడాది వారం రోజుల పాటు మాత్రమే నదికి నిండుగా నీరు ప్రవహించింది. ప్రస్తు తం నదిలో నీరు పూర్తిగా అడుగ ంటింది. ప్రస్తుతం నదిలో వంద క్యూసెక్కుల నీరు కూడా ప్రవహి ంచని పరిస్థితి. కుందూ నీటిని ఆధారం చేసుకొని ఎత్తిపోతల పథకాలు, మోటార్ల ద్వారా సుమారుగా 2వేల ఎకరాలలో వరి, ఇతర పంటలు సాగయ్యాయి. ప్రస్తుతం నదిలో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిపోవడంతో రైతులు జెసిబిలను ఉపయోగించి నీటిమడుగుల నుంచి కాలువలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఏప్రిల్, మే నెలలో కనిపించే పరిస్థితి ప్రస్తుతం నవంబర్ నెలలో కనిపిస్తుందని ఇది చాలా అరుదని రైతులు పేర్కొంటున్నారు. కుందూ నదికి నీటిని విడుదల చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కుందూనదిలో తగ్గిన నీరు

కెసి కాలువకు నీటిని విడుదల చేయాలి

కెసి కెనాల్ పరిధిలో కాలువకు నీరు విడుదల కాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. వరి పంట సాగుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకొని నీరు విడుదల కాకపోవడంతో మినుము జొన్న పంటలు సాగు చేపట్టాం. ప్రస్తుతం కెసి కాలువకు నీరు విడుదల చేసి నిలుపుదల చేశారు. పంటలు ఎండిపోకుండా కాలువకు నీరుని విడుదల చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- భాస్కర్ రెడ్డి, రైతు విశ్వనాథపురం, చాపాడు మండలం.

సాగు చేసిన పంటలు ఎండుతున్నాయి

కుందూ నీటి ఆధారంగా వరి వేశాం. నదిలో నీరు తగ్గుముఖం పట్టడంతో పంటకు సరిగా నీరు అందడం లేదు. అధికారులు స్పందించి కుందూకు నీటిని విడుదల చేస్తే వరి పంట పూర్తి అయ్యేవరకు సాగునీరు అందుతుంది. ఈ ఏడాది ప్రభుత్వం రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

-శాంత రాజు, రైతు, చాపాడు.

కరువు మండలాలుగా ప్రకటించాలి

జిల్లాలో రైతులు వర్షాలు సరిగా పడకపోవడంతో సాగు చేసిన పంటలు ఎండిపోతూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కెసి పరిధిలో రైతులు ఖరీఫ్ సీజన్‌లో వరి సాగుకు చర్యలు చేపట్టి నీరు విడుదల కాకపోవడంతో ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలను కూడా పంపిణీ చేయలేదు. ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికారులతో విచారణ జరిపించి కరువు మండలాలను ప్రకటించాలి.

- దస్తగిరిరెడ్డి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి

అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

స్థానిక అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు జెఎన్‌టియు అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసిఇ విభాగంలో మూడవ సంవత్సరం చదువుతున్న మనోజ్ కుమార్, కంప్యూటర్ సైన్స్ విభాగంలో మూడవ సంవత్సరం చదువుతున్న మసూద్‌బీ, కంప్యూటర్ సైన్స్ రెండవ సంవత్సరం చదువుతున్న మల్లేశ్వరి అనే విద్యార్థులు ఇటీవల తిరుపతిలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించి మంచి భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు, కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ రాజేష్, అన్ని విభాగాధిపతుల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎపి అభివృద్ధిని చూసి కెసిఆర్ నవ్వుతున్నారు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎపిలో వైసిపి ప్రభుత్వ అభివృద్ధిని చూసి తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ నవ్వుతున్నారని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్ అన్నారు. గురువారం పాత బస్టాండ్ లోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును జైల్లో పెట్టి వైసిపి ప్రభుత్వం ఏమి సాధించిందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి జరగాలంటే ఈ ప్రభుత్వం దిగిపోయి ప్రజాస్వామ్యం కాపాడే చంద్రబాబు రావాలని పేర్కొన్నారు. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు, రైతాంగం, ఐటీ, మహిళా సాధికారుత, విద్య, వైద్యం, సంక్షేమం-అభివృద్ధి జరుగుతాయని స్పష్టం చేశారు. సమా వేశంలో టిడిపి మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి గగ్గుటూర్ నజీర్, బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు నాదెండ్ల దస్తగిరి, మైనారిటీ నాయకులు రూపనగుడి హుస్సేన్, రాజంపేట అబ్దుల్ సలాం పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మన్నూరు అక్బర్

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ , జెవివి నాయకులు

11న చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్

బాల, బాలికల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈనెల 11వ తేదీన నగరంలోని ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు బాలోత్సవం కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ రాజశేఖర్ రాహుల్ వెల్లడించారు. గురువారం కడప బాలోత్సవం చిత్రలేఖనం పోటీల పోస్టర్లను ఎస్ వి ఇంజినీరింగ్ కళాశాలలో కమిటీ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ ఈనెల 11 ఉదయం 9 గంటలకు పాఠశాలల విద్యార్థులకు జరిగే చిత్రలేఖన పోటీలను సర్వ శిక్షా అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుదర్శన్ రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ప్రతి విద్యార్థీ చదువుతోపాటు మానసిక ఉల్లాసం కలిగించే చిత్రలేఖనం వంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. పిల్లలు వారి బాల్య దశను ఆహ్లాదకరంగా కొనసాగిస్తూనే ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని భావించి పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ఆసక్తి గల విద్యార్థులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మి రాజా, పరిశ్రమల శాఖ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ గోపాల్, విశ్రాంత ఉప విద్యాధికారి నాగముని రెడ్డి, యోగి వేమన విశ్వ విద్యాలయం లలిత కళల శాఖ సహ ఆచార్యులు డాక్టర్ మృత్యుంజయరావు, వైవీయూ జర్నలిజం శాఖ అధ్యాపకులు డాక్టర్ టి. సురేష్ బాబు, ప్రముఖులు సునీత, సరస్వతి, ఉషా తులసి, శేషమ్మ, విశ్రాంత హెచ్ఎం బాల ఎల్లారెడ్డి, నరసింహారెడ్డి (రిమ్స్), అధ్యాపకులు లెనిన్ ప్రసాద్, ఓబులేసు, జగదీష్ పాల్గొన్నారు.

వెయ్యి నిఘంటువులు పంపిణీ

కలసపాడు : మండలంలోని స్థానిక సెయింట్ ఆంటోనీ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో ఐదవ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలలో అనర్గళంగా మాట్లాడేందుకు ఎఫ్‌సి న్, అధిపతులైన డాక్టర్ చిత్తా థామస్ నేతృత్వంలో ఎఫ్‌సిఎన్ ప్రతినిధులు ఎల్. ప్రసాద్ రెడ్డి, చిత్త రాజశేఖర్ రెడ్డి, ప్రభావతి గురువారం సుమారు 1000 నిఘంటువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు ఇంగ్లీష్ భాష పైన మక్కువ చూపడంతో ఇంగ్లీష్ భాషా సరళిని సులభ పద్ధతిలో కఠినమైన పదాలను అర్థం చేసుకునేందుకు ఈ డిక్షనరీలు ఎంతో ఉపయోగమని వారన్నారు. ఎక్సియన్ సంస్థ గ్రామీణ ప్రాంతాల్లోని పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థిని విద్యార్థుల పైన ప్రత్యేక శ్రద్ధ చూపి ఉన్నత చదువుల కోసం, తగిన సలహాలు సూచనలు కూడా ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య బృందం, చిల్డ్రన్ ఫర్ ఫౌండేషన్ ఇన్ నీడ్ పరిశీలకులు ఎల్ ప్రసాద్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ప్రభావతి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనలో విఫలం

సమావేశంలో మాట్లాడుతున్న ఐలమ్మ కాలనీ అభివృద్ధి కమిటీ కన్వీనర్ గౌతమి

ప్రజాశక్తి - బద్వేలు

పట్టణంలోని ఐలమ్మ కాలనీలో మౌలిక వసతులు కల్పించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని ఐలమ్మ కాలనీ అభివృద్ధి కమిటీ కన్వీనర్ ఎం. గౌతమి పేర్కొన్నారు. ఐలమ్మ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక సుందరయ్య భవనంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దళిత, బడుగు, బలహీన వర్గాలకు చెందిన నిరుపేదలు 20 ఏళ్లుగా ఐలమ్మ కాలనీలలో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నప్పటికీ మౌలిక వసతులు లేకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. పాలకులు మారుతున్నారే తప్ప పేదలు నివాసం ఉన్న ప్రాంతాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని వాపోయారు. రూ. 130 కోట్లతో పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నామని చెబుతున్న ప్రస్తుత ప్రభుత్వం పేదలు నివాసమున్న కాలనీలో నేటికీ బ్రహ్మ సాగర్ మంచినీటి పైపులైన్ కూడా వేయలేదంటే వారు చేసే అభివృద్ధి ఎక్కడో దీన్ని బట్టి అర్థమవుతుందని పేర్కొన్నారు. కాలనీకి వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేక అనేక అవస్థలు పడుతున్నా పాలకులు పట్టించుకోలేదన్నారు. గత సంవత్సరం వినాయక చవితి సందర్భంగా కాలనీని సందర్శించిన మున్సిపల్ చైర్మన్ కాలనీలో సిసి రోడ్లు, మంచినీటి పైపులైన్లు, మురుగునీటి కాలువలు నిర్మిస్తామని, ఇంటి పట్టాలు, డోర్ నెంబర్లు, కరెంటు మీటర్లు మంజూరు చేపిస్తామని హామీ ఇచ్చి నేటికి ఒక్కటి కూడా అమలు చేయక పోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను విస్మరించి కాలనీ పర్యటన చేయడానికి చైర్మన్‌కు నైతిక అర్హత లేదని చెప్పారు. ఇప్పటికైనా వైసిపి ప్రభుత్వం, మున్సిపల్ చైర్మన్ గతంలో వినాయకుని సాక్షిగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేని పక్షంలో రానున్న కాలంలో పేదలందరినీ ఐక్యం చేసి మున్సిపల్ కార్యాలయాన్ని దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో కార్యక్రమంలో ఐలమ్మ కాలనీ అభివృద్ధి కమిటీ నాయకులు సి.సుబ్బారాయుడు, పి.వెంకటసుబ్బయ్య, పి. వెంకటశివ, ఎస్. మస్తాన్ బి. అంకయ్య, మస్తాన్, బాబయ్య, సుబ్బారాయుడు, అనంతమ్మ, సురేంద్ర, రాజగోపాల్, ఆంజనేయులు పాల్గొన్నారు.

98 శాతం హామీలు నెరవేర్చిన సిఎం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట : ఎన్నికల సమయంలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలతోపాటు మరిన్ని పథకాలు ప్రవేశపెట్టి 98 శాతం అమలు చేశారని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని హరిత కల్యాణ మండపంలో వైసిపి ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహిణులతో 'జగన్ ఎందుకు మళ్లీ సిఎం కావా లంటే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ నవరత్నాలు పథకాలను ప్రవేశపెట్టి అమ్మఒడి, జగనన్న విద్యా, వసతి దీవెనలు, వైఎసఆర్ చేయూత, ఆసరా, రైతు భరోసా వంటి పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. రాజంపేట నియోజకవర్గంలో దాదాపు రూ. 1215 కోట్లు ఖర్చు చేసిన ఘనత మన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్లు ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, ఇరుగంరెడ్డి సుబ్బారెడ్డి, వైసిపి అధ్యక్షులు గజ్జల శ్రీనివాసులు రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ రఘురాంరెడ్డి , వైస్ ఎంపిపి గీతా, ఎంపిటిసి నారాయణ రెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.

కార్మికుల ఇళ్లు తొలగింపు దారుణం

కడప అర్బన్ : మాసాపేటలో రోడ్ల విస్తరణ పేరుతో పారిశుధ్య కార్మికుల ఇళ్లను కూల్చడం, పురాతన ఆలయాలను తొలగించడం దారుణమని జై హిందుస్థాన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు నరేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల ఇళ్ల తొలగింపునకు ప్రధాన కారణం అధికార ప్రజాప్రతినిధులే అని విమర్శించారు. ముఖ్యమంత్రి జగ న్మోహన్ రెడ్డికి తెలిసి, తెలియకుండా ఆయన అనుచరులు చేస్తున్న దురాగతాలను వెలికి తీస్తామని హెచ్చరించారు. సమావేశంలో బాధితులు గోవిందమ్మ, లక్ష్మీదేవి, గౌరీ పాల్గొన్నారు.

అమ్మకానికి సిద్ధంగా పొద్దుతిరుగుడు విత్తనాలు

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె : నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో 'ఎన్‌డిఎస్‌హెచ్-1012 ప్రభాస్' అనే పొద్దు తిరుగుడు హైబ్రిడ్ రకం 20 క్వింటాళ్లు, ఎస్ఎఫ్-764 అనే రకం 15 క్వింటాళ్లు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని కెవిపి శాస్త్ర వేత్త శ్రీవల్లి పేర్కొన్నారు. కిలో ప్రొద్దుటూరు విత్తనం 500, కిలో కుసుమ విత్తనం రూ. 110 ఉన్నాయని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మాట్లాడుతున్న టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణ

సిబిఐతో విచారణ చేయించాలి

ప్రజాశక్తి - కడప

రాష్ట్రంలోని మద్యం తయారీ అమ్మకాలపై సిబిఐచే విచారణ చేయించాలని, లక్ష కోట్లు దిగమింగిన జగన్మోహన్ రెడ్డిపై సిపిఐ కేసు నమోదు చేయాలని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు మేకల బాబు, రాష్ట్ర జంగం సాధికార సమితి కన్వీనర్ కె. ఉమాకాంత్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగున్నరేళ్లలో కల్తీ మద్యం అమ్మకాలతో లక్ష కోట్లు దిగమింగిన జగన్ రెడ్డి, మద్యం టెండర్లలో చంద్రబాబు తప్పు చేశాడనడం సిగ్గుచేటని అన్నారు. రూపాయి అవినీతి నిరూపించకుండా స్కిల్ డెవలప్మెంట్‌లో చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారన్నారు. చంద్రబాబును జైల్లో పెట్టి పైశాచిక ఆనందం పొందుతూ, ఫైబర్ గ్రిడ్, ఇన్నర్ రింగు రోడ్డు, అంగల్లు ఘటనలపైనా కేసు పెట్టి వేధించేందుకు ప్రయత్నించారన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో తప్పుడు కేసులు పెట్టడం తప్ప, ఏ కేసులో కూడా ఆధారాలు బయట పెట్టకుండా, కేవలం ఆరోపణలతో కాలం నెట్టు కొస్తున్నారని వాపోయారు. బడుగు, బలహీన వర్గాల అభ్యు న్నతిని అణచి వేయడమే లక్ష్యంగా కొల్లు రవీంద్రపై తప్పుడు కేసు పెట్టారని విమర్శించారు. మద్య నిషేధం చేసిన తర్వాతనే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడుగుతానని చెప్పిన ప్రమాణం ఏమైందని ప్రశ్నించారు. జగన్ రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని కుతంత్రాలకు పాల్పడినా తెలుగుదేశం పార్టీ పోరాటాన్ని ఎవరూ అడ్డుకోలేరని చెప్పారు. రాష్ట్రంలోని మద్యం అమ్మకాలు, తయారీ సరఫరా డిస్టలరీస్‌పై సిబిఐ దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో బిసి సెల్ కార్యదర్శి రాష్ట్ర కార్యదర్శి, నాయకులు పాల్గొన్నారు.

సూచిక బోర్డు ఏర్పాటు చేయండి

కడప : సిపిపురం గ్రంథాలయానికి దారి చూపే సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని రాయల్ రషీద్ అసోసియేషన్ అధ్యక్షులు కరీముల్లా కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కోరారు. జిల్లాలో డిప్యూటీ కలెక్టర్‌గా సిపి బ్రౌన్ సేవలందించారని కడప నగర గాంధీ నగర్, భాకరాపేట రైల్వే గేట్ వద్ద అయన నివాసం ఉండే బంగ్లాను సిపి బ్రౌన్ గ్రంథాలయగా నిర్మించారు అని తెలిపారు. ఆ గ్రంథాలయాన్ని ఎంతోమంది కలెక్టర్లు, న్యాయ మూర్తులు, ప్రముఖ రాజకీయ నాయకులు సందర్శిస్తుంటారని తెలిపారు. కానీ దారి చూపించే బోర్డు లేకపోవడం చాలా బాధాకరమని అన్నారు నగర కార్పొరేషన్ అధికారులు స్థానిక ఎర్రముక్కపల్లి సర్కిల్‌లో బ్రౌన్ గ్రంథాలయానికి వెళ్లే సూచిక బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు.

ట్రాఫిక్ సిఐగా సురేష్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల పట్టణ ట్రాఫిక్ సిఐగా ఎ.సురేష్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తన శాయశక్తులా కృషి చేస్తానని, ఇందుకు వాహనదారులు, పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. ఆయన అన్నమయ్య జిల్లా కలకడ సిఐగా పని చేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ హాజీవల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక ప్రభుత్వం

ప్రజాశక్తి - ఖాజీపేట

వైఎస్ఆర్ జిల్లాలో 36 మండలాల్లో ఒక్క మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించకపోవడం ప్రభుత్వ రైతు వ్యతిరేకతకు ప్రత్యక్ష నిదర్శనమని టిడిపి సీనియర్ నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తమ స్వగ్రామం దుంపలగట్టులో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. అసలు జిల్లాలో కరువే లేదా.. ఉంటే ప్రభుత్వానికి కనిపించడంలేదని ప్రశ్నించారు. జిల్లాలో 50.43శాతం వర్షపాతం తక్కువగా ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో ఒక్క మండలాన్ని అయినా కరువుగా ప్రకటించకపోవడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తపరిచారు. కెసి కెనాల్ ఆయకట్టు కింద ఆరుతడి పంటలు వేసుకోవాలని అధికారిక ప్రకటన వెలువడినప్పటికీ, నీరెక్కడ అని వారు ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో టిడిపి మండల నేతలు రెడ్యం నాగేశ్వర్‌రెడ్డి, ఇండ్ల వెంకట్ రెడ్డి, మున్నెల్లి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి అనేది శూన్యమని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని కటిక బజార్, శాంతి నగర్ వీధులలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ప్రతి ఇంటి వద్దకు వెళ్లి వైసిపి కుట్రలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. అధికారంలోకి రాగానే సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని భూపేష్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండల ఇన్‌ఛార్జి జయరామిరెడ్డి, బయపరెడ్డి, రాజారెడ్డి, లక్షు మయ్య, సూరి, శివారెడ్డి, సంజీవరెడ్డి, సేట్, మల్లికార్జున్‌రెడ్డి, టైలర్ బాబు, కొం డారెడ్డి, రమేష్ నాయుడు, చాంద్ బాషా, అబ్దుల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న బాలికలకు గురువారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్తుకు 10వ తరగతి కీలకమెట్టు అన్నారు. 10 తర్వాత ఎలాంటి విద్య, ఉద్యోగ అవకాశాలు ఉంటాయో విద్యార్థినులకు వివరించారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకుని ప్రణాళికాబద్ధంగా విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ నాగలక్ష్మి, సంస్థ ప్రతినిధి టి.వెంకట సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు చాపాడులో 'జగనన్నకు చెబుదాం'

- కలెక్టర్, ఎమ్మెల్యే రాక

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం అనే కార్యాక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ శ్రీధర్‌నాయుడు తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ విజయ్‌రామరాజు, ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి, జిల్లాస్థాయి అధికారులు రానున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని వాలంటీర్లు అందరూ తమ పరిధిలోని గ్రామ ప్రజలకు తెలియజేసి వారికి ఏవైనా సమస్యలుంటే, వారు వచ్చి అధికారుల సమక్షంలో పరిష్కరించుకునేలా చూడాలన్నారు. అధికారులు పూర్తి నివేదికతో అందుబాటులో ఉండాలన్నారు.

ఆరోపణలు సరికాదు

ప్రజాశక్తి - వేంపల్లె

సమస్యలను వెలికి తీస్తున్న వార్త పత్రికలపై వైసిపి ఎంపిటిసిలు ఆరోపణలు చేయడం శోచనీయమని ఇడుపులపాయ టిడిపి నేత పోతిరెడ్డి శివ అన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పత్రికలపై విమర్శలు చేసే ముందు వారు ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. ప్రజల చేత ఎన్నిక కాకుండా, దొడ్డి దారిన వచ్చిన వారు కూడా ఎంపిటిసిలు అని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. వైసిపి హై కమాండ్ దృష్టిలో డమ్మీ ఎంపిటిసిలుగా ఉన్నారని చెప్పారు. ఏనాడైనా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారా అని ప్రశ్నించారు. వేంపల్లె పంచాయతీ గేటు రద్దు చేయించడంలో కూడా విఫలమైనట్లు తెలిపారు. వైసిపిలో విలువలేదు.. టిడిపిలోకి వస్తామని ఇద్దరు ఎంపిటిసిలు బిటెక్ రవి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డితో మాట్లాడమని తనతో చెప్పారని శివ తెలిపారు. విలేకరుల సమావేశంలో టిడిపి నేతలు పిపి చెంద్రాయుడు, మాజీ ఆర్మీ రెడ్డయ్య, భాను కిరణ్, రాయల్, ఓబయ్య, లక్ష్మణ్, ఓబులు, గంగులయ్య పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

ముద్దనూరు : రహదారి ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు చేపట్టారు. కడప-తాడిపత్రి ప్రధాన రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదాల దృష్ట్యా సిఐ నరేష్ బాబు ఆధ్వర్యంలో ఎస్ఐ చంద్రమోహన్ గురువారం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ఉమ్మాఒడ్డిపల్లె వద్ద, ముద్దనూరు-జమ్మలమడుగు వెళ్లే దారిలోని కూడలి వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. వేగం కన్నా ప్రాణం మిన్న అన్నారు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No :572/2021

IN

O.S.No: 352/2021

ఎద్దు సుబ్బయ్య అలియాస్ గుడిసె సుబ్బయ్య ..పిటిషనర్/వాది

వర్సస్

ఎద్దు నడిపి సైదు వగైరాలు ..రెస్పాండెంట్లు / ప్రతివాదులు

To,

R3) ఎద్దు సైదుమయ్య తండ్రి లేట్ చిన్న సైదు, హిందూ, వయస్సు 25 సంవత్సరాలు, వ్యవసాయం.

R4) ఎద్దు సైదు పీరయ్య తండ్రి లేట్ చిన్న సైదు, హిందూ, వయస్సు 23 సంవత్సరాలు, వ్యవసాయం.

R5) ఎద్దు చిన్న సుబ్బయ్య తండ్రి లేట్ చిన్న సైదు, హిందూ, వయస్సు 21 సంవత్సరాలు, వ్యవసాయం.

R6) ఎద్దు లక్ష్మి తండ్రి లేట్ చిన్న సైదు, హిందూ, వయస్సు 19 సంవత్సరాలు, వ్యవసాయం.

పై రెస్పాండెంట్లు / ప్రతివాదులందరి శాశ్వత చిరునామా

ఓబులాపురం గ్రామం, చింతలపల్లి పోస్టు, కొమరోలు మండలం, ప్రకాశం జిల్లా.

పై రెస్పాండెంట్లు / ప్రతివాదులందరి ప్రస్తుత చిరునామా

గంగిరెడ్డుల కాలనీ, కాల్వకట్ట, ప్రొద్దుటూరు టౌన్, ప్రొద్దుటూరు మండలం, వైఎస్ఆర్ కడప జిల్లా.

పై నెంబరు దావాలో పిటిషనర్ / వాది మీ నుండి పరిహారం రాగోరి పై నెంబరు పిటిషన్ దాఖలు చేసినందున, సదరు దావాలో నీవు కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుటకు తేదీ 09-11-2023న వాయిదా వుండినది. కావున నీవు వాయిదా రోజున ఉదయం 10-30 నిమిషాలకు నీవు స్వయంగా కానీ, లేదా నీ వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై నీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో నీ పరోక్షమందు సదరు పిటిషన్‌ను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వు మేరకు //

గిద్దలూరు
తేదీ 01-11-2023

ఇట్లు
శ్రీ ఎ.తిరుమల ప్రసాద్,
పిటిషనర్/వాది పరం అడ్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
ఆంధ్ర ప్రదేశ్
సెల్ నెం. 9393442442

ప్రమాదకరంగా వంతెనపై గుంతలు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారిపై కుందూ నది సమీపాన ఉన్న వంక వంతెనపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నాయి. వేగంగా వస్తున్న వాహనదారులు ఈ గుంతలో పడి ప్రమాదాల బారిన పడుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు రాత్రి సమయాల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. మైదుకూరు నుంచి ప్రొద్దుటూరు వైపు వెళ్లేటప్పుడు రోడ్డుకు మధ్యలో పెద్ద గుంత ఏర్పడింది. ముందున్న వాహనాన్ని దాటి వెళ్లే సమయంలో ఆ గుంతలో వాహనం పడే ప్రమాదం ఉంది. ఈ రహదారిని గతేడాది రూ.4 కోట్లతో తారు రోడ్డుతో నిర్మించారు. వంతెనపై గుంతలు పూడ్చలేదు. అనంతరం ఆ గుంతలను కొద్దిరోజులకు మట్టితో పూడ్చారు. మట్టి పోయి మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. సంబంధిత అధికారులు ఏ మాత్రం రోడ్లను పర్యవేక్షించడం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. కోట్ల రూపాయలు నిధులు వెచ్చించి రహదారులు నిర్మించినప్పటికీ గుంతలు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుందూ నది, వంకపైన ఉన్న వంతెనపైన ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన పరిస్థితి ఎంతైనా ఉంది.

వంతెనపై ఏర్పడిన పెద్ద గుంత

విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

అన్ని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 8న రాష్ట్రవ్యాప్తంగా జరిగే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ కోరారు. ఆ మేరకు ఆయన గురువారం విద్యాసంస్థల బంద్‌కు సంబంధించిన గోడ పత్రాలను స్థానిక శిరిడి సాయి జూనియర్ కళాశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ నిరుద్యోగం తాండవిస్తోందన్నారు. విద్యార్థులకు ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యాదీవెన, విద్యా వసతి పూర్తిస్థాయిలో అందడంలేదన్నారు. షరతులు విధించడం సరికాదన్నారు. అధికారంలోకి రాకముందు ప్రతి విద్యార్థికి ఉచిత విద్య అందిస్తామని చెప్పి, పిజి విద్యార్థులకు జీరో నెంబర్ 77ను రద్దు చేశారన్నారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు నిధులు కేటాయించాలన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమను సెయిల్ ఆధ్వర్యంలో కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేంద్రం మెడలు వంచైనా సరే ఉక్కు పరిశ్రమను సాధించుకుందాం, ప్రత్యేకహోదా తెచ్చుకుందామని చెప్పి, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీను, హుస్సేన్‌మియా, ఖాదర్, సురేంద్ర, మస్తాన్, నాగేంద్ర, పవన్, వల్లి, విద్యార్థులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి

- మైదుకూరు మున్సిపల్ సమావేశంలో పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్ల తీర్మానం

ప్రజాశక్తి - చాపాడు

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తూ, అవినీతికి పాల్పడుతున్న అధికారులు మైదుకూరు మున్సిపాలిటీకి అవసరం లేదని పాలక వైసిపి, ప్రతిపక్ష పార్టీ టిడిపి కౌన్సిలర్లు పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర అధ్యక్షతన గురువారం మైదుకూరు మున్సిపల్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టేబుల్ ఎజెండాలో మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఎఇ ఎల్.నిరంజన్‌రెడ్డి అవినీతికి పాల్పడుతున్నారని, ప్రజల నుంచి కుళాయి కనెక్షన్ల పేరుతో భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆయన కమలాపురంలో పనిచేస్తూ మైదుకూరు మున్సిపాలిటీలో ఇన్‌ఛార్జిగా ఉన్నారని పేర్కొన్నారు. ఆయనను తొలగించి రెగ్యులర్ ఎఇని నియమించాలని కోరుతూ సమావేశంలో తీర్మానం చేశారు. దీనిపై టిడిపి కౌన్సిలర్లు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా అవినీతికి పాల్పడుతున్న అధికారులు మున్సిపాలిటీలో ఉండకూడదన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే అధికారులు సమస్యలను పరిష్కరించి ప్రజలకు చేరువగా ఉండాలని సూచించారు. పలువురు టిడిపి కౌన్సిలర్లు తమ వార్డులోని సమస్యలను పరిష్కరించాలని చైర్మన్ దృష్టికి తెచ్చారు. ఇందుకు ఆయన స్పందిస్తూ వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమా వేశంలో మున్సిపల్ కమిషనర్ వై.రంగస్వామి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

తీర్మానాన్ని ఆమోదిస్తున్న టిడిపి, వైసిపి కౌన్సిలర్లు

జబ్బులను అవహేళన చేయడం పద్ధతికాదు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మనిషి జబ్బులను అవహేళన చేయడం ఎమ్మెల్యే రాచమల్లుకు పద్ధతి కాదని మాజీ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. స్థానిక నెహ్రు రోడ్డులోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు బెయిల్‌పై, ఆయనకున్న ఆరోగ్యం పట్ల ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడడం సరికాదన్నారు. వేలకోట్ల అవినీతి ఆరోపణలతో జగన్మోహన్‌రెడ్డి 16 నెలలు జైలులో ఉన్నాడని, ప్రస్తుతం బెయిల్‌పైనే బయట ఉన్నాడన్నారు. కేంద్రం దయాదాక్షిణ్యాలతో 10 సంవత్సరాల నుంచి జగన్మోహన్‌రెడ్డి బెయిల్‌పై బయట ఉన్నాడని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి కుమారుడిగా మంచి పరిపాలన అందిస్తారని ప్రజలు అధికారం కట్టబెడితే, దోపిడీ కోసమే వైసిపి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్ అధికారాన్ని అడ్డుపెట్టుకుని చంద్రబాబుపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, టిడిపి నాయకుడు వద్ది బాలుడు పాల్గొన్నారు.

హింసను సమర్థించడం శోచనీయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రాజకీయాల కోసం హింసను సమర్థించడం శోచనీయమని మున్సిపల్ వైస్ చైర్మన్ ఖాజామెహిద్దీన్ (ఆయిల్‌మిల్ ఖాజా) హితవు పలికారు. తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత శనివారం బెనర్జీపై జరిగిన హత్యాయత్నం సంఘటనలో టిడిపి నాయకులు ఏమాత్రం మానవత్వం లేకుండా పత్రికా ప్రకటనలు ఇవ్వడాన్ని సభ్యసమాజం హర్షించదన్నారు. పెద్దాయన, అనుభవజ్ఞులు వరదరాజులరెడ్డి ఆకస్మిక సంఘటన అని చెప్పడం, టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్ చిల్లర గలాటా అని చెప్పడం, సినీహబ్ రాజేశ్వరరెడ్డి గీసుకుపోయింది అని వాఖ్యానించడం సరైంది కాదన్నారు. ఈ హత్యాయత్నం ముందస్తు ప్రణాళికతో కుట్ర పూరితంగా జరిగిందన్నారు. సంఘటనాస్థలంలో ఉన్న ఎస్ఐ కేకలు వేయడంతో హంతకులు పారిపోయారన్నారు. గతంలో ఇలాంటి సంఘటనే రామేశ్వరంలో జరిగినప్పుడు ఎమ్మెల్యే రాచమల్లు పేరు 307లో నమోదు చేయగా, కడప ఎస్‌పిని కలిసి తను నేరం చేయలేదని సంజాయిషీ ఇచ్చుకున్నారని గుర్తు చేశారు. ప్రవీణ్ పారిపోవడాన్ని ఖాజా ప్రశ్నించారు. నవరత్నాల ద్వార అన్ని వర్గాల ప్రజలకు ఏదో ఒక మేలు అందుతూ ఉంటే జగన్‌పాలనను రాక్షసపాలన అని అనడం ఎంత వరకు సమంజసమని టిడిపి నాయకులు ముక్తియార్‌ను ఆయన ప్రశ్నించారు. నాయకులు ప్రజాస్వామ్య పద్ధతిలో రాజకీయంగా ఎదగాలని సూచించారు.

మాట్లాడుతున్న వైస్ చైర్మన్ ఖాజా

జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి : సిపిఎం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం 103 కరువు మండలాలు ప్రకటిస్తే అందులో కడప జిల్లాలో ఒక్క మండలం కూడా ప్రకటించకపోవడం చాలా దుర్మార్గమని, వెంటనే కరువు మండలాలను ప్రకటించాలని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివ నారాయణ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 36 మండలాల్లో ఖరీఫ్ సీజన్ ముగిసేనాటికి తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వేసిన పంటలు నిలువునా ఎండిపోతున్నాయని తెలిపారు. జిల్లా ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులు స్పందించి కరువు మండలాలను ప్రకటించేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. సన్న , చిన్న కారు, మధ్యతరగతి రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కరువు మండలాలు ప్రకటించకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన, పోరాటాలకు శ్రీకారం చుడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎల్లయ్య, హుస్సేన్ బాషా పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి కల్పనకు ఉద్యమిద్దాం

జమ్మలమడుగు రూరల్ : ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం ఉద్యమిద్దామని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని ముద్దనూరు రోడ్డులోని డివైఎఫ్ఐ జెండా స్థూపం వద్ద 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు తుడుం ఎల్లయ్య అధ్యక శివకుమార్ పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లయ్య, తులసీశ్వర్ యాదవ్, నాయకులు సురేష్, నాగేంద్ర, ఉదయ్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

సత్ప్రవర్తనతో మెలగాలి : డిఎస్‌పి

పులివెందుల రూరల్ : రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా, సత్ప్రవర్తనతో మెలగాలని డిఎస్‌పి వినోద్‌కుమార్ సూచించారు. పులివెందుల డిఎస్‌పి కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని రౌడీ షీటర్లకు డిఎస్‌పి ఆయా మండలాల ఎస్ఐల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. వివిధ నేరాల్లో రౌడీ షీటర్లుగా ఉన్నవారు ఎలాంటి నేరాలకు పాల్పడవద్దని సూచించారు. లా అండ్ ఆర్డర్‌కు అంతరాయం ఏర్పడేలా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పులివెందుల సిఐ రాజు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మలమడుగు : జమ్మలమడుగు సబ్ డివిజన్‌కు చెందిన 125 మంది ట్రబుల్ మాంగర్స్, బ్యాడ్ క్యారెక్టర్స్‌లకు గురువారం డిఎస్‌పి నాగరాజు కౌన్సెలింగ్ ఇచ్చారు. జమ్మలమడుగు అర్బన్, పెద్దముడియం, మైలవరం, తలమంచిపట్నం, యర్రగుంట్ల, కలమల్ల, ముద్దనూరు, కొండాపురం, తాళ్ల పొద్దుటూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ఎస్‌పి ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కడప ఎఆర్ డిఎస్‌పి రమణయ్య, ప్రొద్దుటూరు ఫ్యాక్షన్ జోన్ సీఐ బొజ్జప్ప, కడప పిసిఆర్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సబ్ డివిజన్‌కు సంబంధించిన సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

20 కిలోల గంజాయి స్వాధీనం

ప్రొద్దుటూరు : 20కిలోల గంజాయిని, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని గురువారం త్రీటౌన్ సిఐ వెంకటరమణ తెలిపారు. సమాచారం మేరకు ఎస్ఐ మోహన్‌రెడ్డి, త్రీటౌన్ ఎస్ఐ బాలఅంకయ్య సిబ్బందితో భగత్‌సింగ్ కాలనీలోని దర్గా వద్ద తూర్పు గోదావరి జిల్లాకు చెందిన సుబ్బారావు, ప్రొద్దుటూరుకు చెందిన కుమ్మరి చిన్న యల్లయ్య, నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన పాల గోత్రం సుబ్బరాయుడు రవాణా, అమ్మకం చేస్తూ ఉండి పారి పోయేందుకు ప్రయత్నించగా సిబ్బంది అప్రమత్తమై అదుపులోనికి తీసుకున్నారన్నారు. గంజాయి, మూడు సెల్‌ఫోన్లు, కారు, రూ.5,950 స్వాధీనం చేసుకున్నామన్నారు.

KADAPA URBAN DEVELOPMENT AUTHROITY

"ap'e-procurement Tender Notice
Tender Notice. 2 to 4/EE/KUDAFUNDS/2023-24,
Dated : 01.11.2023

S.No.	Name of the Scheme	No.of Works	Ecv.(Rs.in Lakhs)
02	Renovation of Park	1	11.51
	TOTAL:-	1	11.51

3. Bid Document Download Start Date : 03.11.2023 @ 10.30 A.M.
4. Bid Document Download End Date : 09.11.2023 @ 3.30 P.M.
5. Price Bid Opening Date : 09.11.2023 @ 4.00 P.M.

Further details can be seen at ap'e'Procurement market place in www.apeprocurement.gov.in officer inviting bid Vice Chairman, Kuda, Kadapa, A.P.

Y.O.Nandan
Vice Chairman,
Kadapa Urban Development Authority,
YSR District.

వీరభద్ర స్వామిని దర్శించుకున్న దిశ డిఎస్‌పి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిది .లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె వీర భద్ర స్వామిని కడప జిల్లా దిశ పోలీస్‌స్టేషన్ డిఎస్‌పి రమాకాంత్ బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఇఒ శ్రీనివాసులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ మర్యాదలతో డిఎస్‌పిని ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ పురాతన వీరభద్ర స్వామి దేవస్థానాన్ని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిఎస్‌పిని సన్మానిస్తున్న ఇఒ శ్రీనివాసులు, అర్చకులు

వెలుగులోకి పురాతన విగ్రహం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని రేకులకుంట గ్రామం ఎస్సీ కాలనీ దక్షిణం వైపు గురువారం 18వ శతాబ్దం నాటి విగ్రహం బయటపడిందని రచయిత హిస్టోరియన్ బొమ్మిశెట్టి రమేష్ తెలిపారు. మండల వైస్ ఎంపిపి కూనపులి రాజశేఖర్ నాయుడు తన పొలాలను సేద్యం చేస్తుండగా ఈ విగ్రహం బయటపడింది. ఈ విషయాన్ని నాయిని రమేష్ నాయుడు, పత్రామంచాల వెంకటేష్ తనకు తెలిపారని ఆయన చెప్పారు. ఈ విగ్రహంలో ఒక మహిళ తన ఎడమచేయి వైపు ఓ చంటి బిడ్డకి చనుబాలు ఇస్తున్నట్లుగా స్పష్టంగా కనబడుతోందని రచయిత అన్నారు. విగ్రహం గురించి మైసూర్ ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ మునిరత్నంరెడ్డికి తెలుపగా ఇది 18వ శతాబ్దం నాటి విగ్రహం అని ఆయన స్పష్టం చేసినట్లు బొమ్మిశెట్టి రమేష్ తెలిపారు.

ఎస్ఆర్ఐటి అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక రూరల్ పరిధిలోని సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న బోరెడ్డి రఘునాథ్‌రెడ్డికి డాక్టరేట్ లభించింది. మధ్యప్రదేశ్‌లోని సేహోరుకు చెందిన శ్రీ సత్యసాయి యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మెడికల్ సైన్సెస్‌కు 'సాయిల్ స్ట్రక్చర్ ఇంటరాక్షన్ ఎఫెక్ట్స్ ఆన్ పుష్ ఓవర్ అనాలసిస్ అఫ్ షాట్ స్పన్ ఆర్ సి బిడ్జిస్' అనే అంశం మీద పరిశోధన పత్రాలను సమర్పించినందుకు ఆయనకు డాక్టరేట్ అందజేశారని కళాశాల ప్రిన్సిపల్ పాండురంగన్ రవి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీర కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి, అకాడమిక్ డిన్ డాక్టర్ వై.రామసుబ్బారెడ్డి, హెచ్ఒడిలు, అధ్యాపకులు రఘునాథ్‌రెడ్డిని అభినందించారు.

వీధి కుక్కలు పట్టివేత

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న వీధి కుక్కలను పంచాయతీ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. 'ప్రజాశక్తి' దినపత్రికలో గురువారం 'వేంపల్లెలో వీధి కుక్కల స్వైర విహారం' అనే కథనం ప్రచురితమైంది. పంచాయతీ అధికారి సుబ్బారెడ్డి కుక్కలు పట్టే వారిని పిలిపించి, వాటిని పట్టి దూర ప్రాంతాలకు తరలించారు. పంచాయతీ అధికారులు వీధి కుక్కలను పట్టి వేయడంతో ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులు కూడా శ్రీచైతన్య, పిరమిడ్ నగర్ ప్రాంతాల్లో ఉన్న వీధి కుక్కలను పట్టే వారికి సహకరించారు. పారిశుధ్య మేస్త్రీలు అల్లాబకష్, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశాలు విధిగా నిర్వహించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విధిగా సచివాలయ కన్వీనర్లు సమావేశాలు నిర్వహించాలని, ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ ముఖ్యమంత్రి జగనన్నే కావాలని ప్రజలకు వివరించాలని జెసిఎస్ రీజనల్ కో-ఆర్డినేటర్ చల్లా మధుసూదన్‌రెడ్డి కోరారు. పట్టణంలోని జెసిఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రరెడ్డి చల్లా మధుసూదన్‌రెడ్డిని కార్యాలయంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సమావేశంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి అన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో సచివాలయ కన్వీనర్లతో సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి మండలానికి బూత్ కన్వీనర్, సచివాలయానికి ఇద్దరు కన్వీనర్లను నియమించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను సీఎం చేయాలని, ఆ మేరకు ప్రతి కన్వీనర్ కృషి చేయాలన్నారు.

మాట్లాడుతున్న ప్రాంతీయ జిల్లా కో-ఆర్డినేటర్

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

ఎర్రగుంట్ల : ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం మండల సర్వ సభ్య సమావేశాన్ని ఎంపిడిఒ రహమతుల్లయ్య అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ఎంపిపితో సహ పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు డుమ్మా కొట్టారు. అధికారులు తమ శాఖలకు సంబం ధించిన వివరాలను సభ్యులకు వివరించారు. మండలాన్ని కరువు మండలంగా ప్రకటించేలా నివేదికలు ఉన్నతాధికారులకు పంపాలని సూచించారు. కరెంట్ కోతలు లేకుండా చూడాలన్నారు. జడ్పిటిసి బాలయ్య మాట్లాడుతూ అధికారుల పనితీరు బాగుందని తెలిపారు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No : 352/2021

ఎద్దు సుబ్బయ్య అలియాస్ గుడిసె సుబ్బయ్య ..వాది

వర్సస్

ఎద్దు నడిపి సైదు వగైరాలు ..ప్రతివాదులు

To,

D3) ఎద్దు సైదుమయ్య తండ్రి లేట్ చిన్న సైదు, హిందూ, వయస్సు 25 సంవత్సరాలు, వ్యవసాయం.

D4) ఎద్దు సైదు పీరయ్య తండ్రి లేట్ చిన్న సైదు, హిందూ, వయస్సు 23 సంవత్సరాలు, వ్యవసాయం.

D5) ఎద్దు చిన్న సుబ్బయ్య తండ్రి లేట్ చిన్న సైదు, హిందూ, వయస్సు 21 సంవత్సరాలు, వ్యవసాయం.

D6) ఎద్దు లక్ష్మి తండ్రి లేట్ చిన్న సైదు, హిందూ, వయస్సు 19 సంవత్సరాలు, వ్యవసాయం.

పై ప్రతివాదులందరి శాశ్వత చిరునామా

ఓబులాపురం గ్రామం, చింతలపల్లి పోస్టు, కొమరోలు మండలం, ప్రకాశం జిల్లా.

పై ప్రతివాదులందరి ప్రస్తుత చిరునామా

గంగిరెడ్డుల కాలనీ, కాల్వకట్ట, ప్రొద్దుటూరు టౌన్, ప్రొద్దుటూరు మండలం, వైఎస్ఆర్ కడప జిల్లా.

పై నెంబరు దావాలో వాది మీ నుండి పరిహారం రాగోరి పై దావా దాఖలు చేసినందున, సదరు దావాలో నీవు కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుటకు తేదీ 09-11-2023న వాయిదా వుండినది. కావున నీవు వాయిదా రోజున ఉదయం 10-30 నిమిషాలకు నీవు స్వయంగా కానీ, లేదా నీ వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై నీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో నీ పరోక్షమందు సదరు దావాను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ 09-11-2023

ఇట్లు
శ్రీ ఎ.తిరుమల ప్రసాద్,
వాది పరం అడ్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
ఆంధ్ర ప్రదేశ్
సెల్ నెం. 9393442442